# విషపుసీసాతో విడాకులు

రచయిత:

వి. వి. యస్. ప్రసాదరావు, బి. ఏ.

ఆమె ప్రకృతివిచిత్రం. ఆమె నర్తకిగాయకి ఆమె ఖ్యాతి దేశదేశాలు మ్రోగిపోతూంది. చక్రవాకపక్షి మేఘుణ్ణి ప్రేమించినట్టుగా, ఆమె నవీనుని కాంక్షించింది. అతను గొప్ప తత్వవేత్త, కళోపాసి. ఆమె సుందరాకృతిలో అతనికి ప్రకృతి అంతా కళామయమే.

సంధ్యాసమయం. ఆమె తనమందిరంలో ఒక సోఫాపై కూర్చుంది. గదిలో ఒకపక్క అంతా చిత్రాలంకారశోభితం. రెండవపక్క దిగంబరత్వం— తెల్లగోడల వెర్రిచూపులు. ఆమె కూర్చున్నసోఫా మెత్తనిదే; కాని పైన పులిచర్మం కప్పబడఉంది. ఆమెజడ పొడుగాటిదే; నల్లత్రాచులా ఉంది. ఆమె చూపులు సుందరం; నిశితం. ఆమె పాల బుగ్గలు అమృతకలశాలు. కాని విషలిప్తం. ఆమె మందహాసం మధురం; కాని కర్కశం.

గదిఅంతా నిశ్శబ్దం. ఆమె వీధివైపు తీక్ష్ణంగా చూస్తోంది—చేతిలో ఉత్తరంకేసి చూస్తో యేదో దీర్ఘంగా ఆలోచిస్తోంది... ఒక్కసారి ఉలిక్కిపడింది- దేహమంతా ఒక్కక్షణం చలించింది. మరల ప్రశాంతంగా గుమ్మంవైపు చూచింది- గుమ్మంలో నవీనుడు ప్రత్యక్షం. అతను నెమ్మదిగా ఆమె దగ్గరకువచ్చి, ఎదురుగా కూర్చున్నాడు: ఒక్కసారి ఆమెకేసి దీర్ఘంగా చూచాడు- ఆమె తలవాల్చింది—

'రేఖా,' అంటూ, అతను ఒక చిన్న సీసా తీసాడు. ఆమె అతనివైపుచూచి త్రుళ్ళిపడింది: మోహం వెలవెలపోయింది.

'ఈసీసా నీ బొట్టుపెట్టెలో ఉంది. ఇది నీకెక్కడిది రేఖా?' అన్నాడు నవీనుడు.

'..........' ఆమె అతనివైపు తీక్ష్ణంగాచూచింది—ఆమె ముఖంలో కత్తివేటుకైనా నెత్తురుచుక్కలేదు.

రేఖా! యిదిఘోరమైనవిషం. దీనిమీద బొంబాయి మెడికల్ ఫరమ్ వాళ్ల పేరుంది. నీకెలావచ్చింది.?

ఆమె మౌనందాల్చింది—అతను అప్రయత్నంగా జారిన ఆమెపైటవైపుచూచాడు- బాడీలోనుంచి ఉత్తరంసగం కనిపిస్తోంది. ఒక్కక్షణంలోలాగేసి చదివేసాడు. సమయం మించింది. ఇంక భయపడనవసరంలేదనుకుంది రేఖ. పూర్తిగాధైర్యంవహించింది- భయంకరవ్యాఘ్రంలా రోజుతూ అతనివైపుచూస్తు నిలబడింది.

ఒక్క త్రుటికాలం గదిఅంతా నిశ్శబ్దం- నవీనుడు లేచి నిలబడ్డాడు. అతని శరీరం కంపించి పోతూంది. అతనికళ్లలో మోటార్లరైళ్లు గిరగిరా తిరుగుతున్నాయి.

'రేఖా ?'

ఆమె మౌనందాల్చింది.

'రేఖా, ఎవరీ దేవదాసు ? అన్నాడు నవీనుడు.

'ఆర్టుడైరక్టరు' అంది నెమ్మదిగా రేఖ.

'నీ వతనిని ప్రేమించావా?'

ప్రత్యుత్తరం మౌనం......

'రేఖా నీవు నర్తకివి. నీకీర్తి దేశమంతా వ్యాపించింది. నీవు సామాన్యుణ్ణి నన్ను ప్రేమించి వివాహంచేసుకొని గొప్ప త్యాగం చేసావు. నీకు నే నెప్పుడూ కృతజ్ఞుడనే.

'............'

రేఖా, నీ మనస్సు కష్టపెట్టుకొనకు. నీ హృదయాన్ని శాసించుటకు నాకెట్టి అధికారంలేదు. నీవు సంపూర్ణంగా స్వేచ్ఛానువర్తివి. నీ కాతనియందు దిష్టముంటే వానిని పెండ్లి చేసికోవచ్చును.'

రేఖ కాతని ధోరణి అర్థంకావడంలేదు తనలో ఏదో ఆవేదన కలుగుతోంది. కాని ప్రయత్నంమీద అణచిపెట్టింది.

'రేఖా, నీ వివాహమునకు నాకెట్టి అభ్యంతరమూ లేదు.' అని నవీను డామెకేసి చూసాడు.

'విడాకులో' అని నెమ్మదిగా గొణిగింది రేఖ.

'ఇవే'...అంటూ నవీనుడు విషం సీసా చూపించాడు.


## అమ్మకమునకు

### తెనుగు అచ్చుటైపులు, ఇతర అచ్చుపరికరములు

క్రౌనుసైజున నాలుగైదుఫారములకు తగు అచ్చు తెనుగు ఇంగ్లీషుబాడీ టైపులు, గ్రేట్ ప్రయిమర్ టైపులు, హెడ్డింగుటైపులు, కేసులు, స్టాండులు, ఛెస్సులు, గాలీలు, స్టిక్కులు, గాలీస్టాండులు, ఇంకను ఇతరపరికరములు సెకండుహ్యాండువి అమ్మకమునకు సిద్ధముగా ఉన్నవి. వలయువారు వెంటనే దిగువ చిరునామాకు వివరములకొఱకు వ్రాయవలెను.

పిడుగు వెంకటకృష్ణారావు పంతులు, 2/40 పెద్దునాయనివీధి, మదరాసు.



## ఆంధ్రభూమి

సంచికలు సంపుటములుగా కట్టబడియున్నవి.

మొదటి సంవత్సరపు పండ్రెండు సంచికలుగల సంపుటము : రూ 3—0—0.
రెండవ సంవత్సరపు పండ్రెండు సంచికలుగల సంపుటము : రూ 3—0—0.
మూడవ సంవత్సరపు పండ్రెండు సంచికలుగల సంపుటము : రూ 1—8—0.

7-8-0 వెలగల ఈ మూడు సంపుటములు ఒకేసారికొను గ్రంథాలయములకు రూ 6-0-0 కే ఈయబడును.